క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

ఎదలాపురం: న్యాక్ ఆధ్వర్యంలో ఎస్సీ అభ్యర్థులకు ఎస్బీ టెట్ సర్టిఫికేషన్ కింద కన్స్ట్రాక్షన్ సేఫ్టీలో ఆరు నెలల పాటు ఉచిత శిక్షణ నిర్వహిస్తున్నట్లు న్యాక్ అధికారులు సీహెచ్ రవికుమార్, ద్యావంత్ రమేశ్‌లు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. శిక్షణ అనంతరం ప్లేస్‌మెంట్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు డిప్లొమా, ఏదైనా బ్రాంచ్‌లో బీటెక్ పూర్తి చేసి ఉండాలన్నారు. వివరాల 98665 65156 సంప్రదించాలన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి

నార్నూర్: ప్రజలు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ అన్నారు. శుక్రవారం ఎస్ఎంసీ చైర్మన్ రాథోడ్ సుభాష్‌తో కలిసి ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన వినాయకుడి పూజలో పాల్గొన్నారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో ప్రయణించాలన్నారు.

చర్యలు తీసుకోవాలి

బోథ్: అమెరికాలో ఉంటూ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నాయకులు రాజ్ బోడపై చర్యలు తీసుకోవాలని నాయకులు శుక్రవారం బోథ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయనపై కేస్ నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ బోథ్ అసెంబ్లీ అధ్యక్షుడు చిలుముల పంచాక్షరి, మండల ప్రధాన కార్యదర్శి బత్తుల ప్రవీణ్, గడ్డం నగేశ్, గడప ప్రవీణ్, రాహుల్, గంగాధర్, సన్ని పాల్గొన్నారు.

స్పాట్ కౌన్సెలింగ్

బోథ్: టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ పాఠశాలల్లో 6,7,8వ తరగతుల్లో మిగిలిపోయిన సీట్లకు 23న లక్షెట్టిపేటలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు బోథ్‌లోని టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత తెలిపారు. ఎస్సీ విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు.

కార్యవర్గం ఎన్నిక

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం జై ఆదివాసీ యువశక్తి జిల్లా అధ్యక్షుడు గావండే బిపిన్‌కుమార్ ఆధ్వర్యంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మడావి సురేందర్, ఉపాధ్యక్షుడిగా హెరకుమ్ర కొతుంబాయి, ప్రధాన కార్యదర్శిగా దుర్వ ఆనంద్ రావు, సంయుక్త కార్యదర్శిగా మెస్రం మోహన్, కోశాధికారిగా ఆత్రం అనిల్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వడ్డి ప్రశాంత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మెస్రం ప్రకాష్, నైతం గణేష్, తొడసం శంకర్, జాలిమ్‌షా, సునీల్ పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

నేరడిగొండ: అంగన్‌వాడీ కేంద్రాల్లో సమయపాలన పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. శుక్రవారం మండలంలోని వడూర్, చిన్నబుగ్గారం అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తెరిచి ఉంచాలన్నారు. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రంలో ఒకపూట సంపూర్ణ భోజనాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయా, చిన్నారులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

ఉట్నూర్‌రూరల్: చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఉట్నూర్ సివిల్ కోర్టు జడ్జి దుర్గారాణి అన్నారు. శుక్రవారం మండలంలోని శ్యాంపూర్ గ్రామంలో విద్యార్థులకు, స్థానికులకు చట్టాలపై అవగాహన కల్పించారు. సమాజంలో జరుగుతున్న మార్పులను వివరించారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి హోదాలో ఉండాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లిక, వైస్ ఎంపీపీ బాలాజీ, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఉపాధిహామీ' నిర్వీర్యానికి కేంద్రం కుట్ర

ఎదులాపురం: ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్ర చేస్తుందని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు దండేకర్ వామన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కుమురం భీం భవన్‌లో శుక్రవారం మాట్లాడారు. బడ్జెట్లో కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ నిధుల్లో కోత విధిస్తోందన్నారు. కూలీలకు 200 రోజుల పని దినాలు కల్పించాలని కోరారు. సమావేశంలో నాయకులు జగన్ సింగ్, నితిన్, మారుతి, అశోక్, వినోద్, సంజు పాల్గొన్నారు.

తానా సమ్మేళనానికి సరిత

తాంసి: ఉత్తర అమెరికాలోని తెలుగు సంఘం తానా ప్రపంచ సాహిత్య వేదిక సెప్టెంబర్ 24వ తేదీన నిర్వహిస్తున్న నారి సాహిత్య భేరి అంతర్జాతీయ శతాధిక కవయిత్రుల సమ్మేళనానికి ఆదిలాబాద్‌కు చెందిన కవయిత్రి గొడి సరిత ప్రత్యేక ఆహ్వానం అందుకున్నారు. సరిత ప్రస్తుతం ప్రాథమిక పాఠశాల పొన్నారిలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ప్రత్యేక అతిథిగా గళం వినిపించే అవకాశం కల్పించినందుకు తానా అధ్యక్షుడు శృంగవరపు నిరంజన్, నిర్వాహకులు డాక్టర్ తోటకూర ప్రసాద్, సమన్వయ కర్త చిగురుమల్ల శ్రీనివాస్‌కు ధన్యవాదాలు తెలిపారు.

నిమజ్జన ఏర్పాట్లకు రూ.22 లక్షలు

- రోడ్ల తాత్కాలిక మరమ్మతులకు రూ.16 లక్షలు
- ప్రారంభమైన గుంతల పూడ్చివేత
- పెన్‌గంగ నది వద్ద పకడ్బందీ ఏర్పాట్లు



గుంతలు పడిన రోడ్డు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్‌లో నిర్వహించే వినాయక నిమజ్జన శోభాయాత్రకు మున్సిపల్ కౌన్సిల్ ద్వారా రూ.22 లక్షల నిధులు కేటాయించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పట్టణంలోని రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేయనున్నారు. వీటితో పాటు వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసే తెలంగాణ– మహారాష్ట్ర సరిహద్దులోని పెన్‌గంగా నది, ఆదిలాబాద్ రూరల్ మండలం చాంద– టి వాగు వద్ద అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు నిధులను వెచ్చించనున్నారు. ఇందుకోసం ఇప్పటికే ఆన్‌లైన్ టెండర్ల ప్రక్రియ పూర్తి చేసిన అధికారులు టెండర్ దక్కించుకున్న గుత్తేదారుకు పనులు అప్పగించారు.

నిధుల కేటాయింపు ఇలా..

- ఆదిలాబాద్ పట్టణంలోని 49 వార్డుల్లో వినాయక శోభాయాత్ర సాగనున్నందున గణేష్ మండపాల నిర్వాహకులు, ఆయా కాలనీల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. 49 వార్డులకు రూ.16లక్షల నిధులను కేటాయించారు.
- మహారాష్ట్ర– తెలంగాణ సరిహద్దులోని పెన్‌గంగా నదిలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారు. నది వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టనున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా, వినాయక విగ్రహాలతో వచ్చే వారికి ఇబ్బందులు తలెత్తకుండా బారికేడ్లు, తాత్కాలిక మరుగుదొడ్లు, నీటి సరఫరా, క్రేన్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఇందు కోసం రెండున్నర లక్షల రూపాయలను వెచ్చించనున్నారు.
- నిమజ్జన శోభయాత్రను తిలకించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివస్తారు. శోభాయాత్ర సాగే ఆదిలాబాద్ పట్టణంలోని మార్గంతో పాటు పెన్‌గంగా నది వద్ద లైటింగ్‌ను ఏర్పాటు చేయనున్నారు. దీని కోసం రూ.2లక్షలు కేటాయించారు.
- నిమజ్జన శోభాయాత్ర ప్రారంభ కార్యక్రమం ప్రతి ఏటా వినాయక్ చౌక్‌లోని శిశు మందిర్‌లో నిర్వహిస్తారు. ఇక్కడ అవసరమైన ఏర్పాట్ల కోసం ఒకటిన్నర లక్షలను కేటాయించారు.
- స్టేజీ, సౌండ్ సిస్టమ్, ఇతర సౌకర్యాల కోసం ఈ నిధులను ఖర్చు చేయనున్నారు.

ప్రారంభమైన మరమ్మతులు..

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పట్టణంలోని పలు కాలనీల్లో అంతర్గత రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. అందులో వర్షపు నీరు నిలిచి ప్రమాదకరంగా తయారయ్యాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వినాయక నిమజ్జన గడువు సమీపిస్తుండడంతో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్లు రోడ్ల మరమ్మతు పనులు ప్రారంభించారు. గుంతలను మొరంతో పూడ్చుతున్నారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించినట్లుగా కమిషనర్ శైలజ తెలిపారు. శోభయాత్రకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు కల్పిస్తామని ఆమె వెల్లడించారు.

అంగన్‌వాడీల వినూత్న నిరసన



తాంసి: వినాయకుడికి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

నార్నూర్: అంగన్‌వాడీల సమ్మె శుక్రవారంతో 12వ రోజుకు చేరుకుంది. తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. సంఘం నాయకురాలు పంచశీల, మల్లులు మాట్లాడుతూ.. 46 ఏళ్లగా అంగన్‌వాడీ కేంద్రాల్లో విధులు నిర్వర్తిస్తున్నా.. ఎలాంటి ఉద్యోగ భద్రత లేదన్నారు. కనీస వేతనంతో పాటు సమస్యలు పరిష్కరించాలని కోరారు.

వినాయకుడి వినతిపత్రం

తాంసి: గతకొన్ని రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదని భీంపూర్ మండల కేంద్రంలో అంగన్‌వాడీలు శుక్రవారం వినూత్న నిరసన తెలిపారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద వినాయకుడికి వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ, అంగన్‌వాడీలు మీరాబాయి, సునీత, సుజాత, గంగమ్మ పాల్గొన్నారు. అలాగే డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. మండల అధ్యక్షురాలు సరితా రెడ్డి, గంగమ్మ, రూప, భాగీర్థ, విజయలక్ష్మి, మమత పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్షలు

కైలాస్‌నగర్: ఉద్యోగ భద్రతను కల్పించాలనే డిమాండ్‌తో అంగన్‌వాడీలు కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె 12వ రోజుకు చేరింది. అయిన ప్రభుత్వం స్పందించడం లేదని శుక్రవారం అంగన్‌వాడీలు సమ్మె శిబిరంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బండి దత్తాత్రి పూలమాలలు వేసి ప్రారంభించారు. కనీస వేతనం రూ.26వేల చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న అడ్డి భోజారెడ్డి

తాంసి: ప్రాథమిక సహకార సంఘాల ద్వారా రైతులకు అందిస్తున్న రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి హాజరై మాట్లాడారు. రూ. 900 కోట్ల రూపాయల ఉన్న బ్యాంకు రుణాలను ప్రస్తుతం రూ.1400 కోట్లకు పెంచడం జరిగిందన్నారు. వ్యవసాయ రుణాలతో పాటు వ్యవసాయేతర రుణాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ ధనుంజయ్, సీఈవో కేశవ్, డైరెక్టర్‌లు భూమారెడ్డి, నారాయణ, సంతోష్ రెడ్డి, బుజ్జన్న, చంద్రన్న పాల్గొన్నారు.

ఈ– పంచాయతీ ఉద్యోగుల సమ్మెబాట



అడిషనల్ కలెక్టర్‌కు సమ్మె నోటీస్ అందజేస్తున్న పంచాయతీ ఆపరేటర్లు

కైలాస్‌నగర్: సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పంచాయతీరాజ్ శాఖలో పనిచేస్తున్న ఈ–పంచాయతీ టెక్నికల్ ఉద్యోగులు సమ్మెబాట పడుతున్నారు. శుక్రవారం స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ ఖుష్బు గుప్తాకు సమ్మె నోటీస్ అందజేశారు. డీపీఎంతో పాటు పంచాయతీల్లో పనిచేసే ఆపరేటర్లు విధులకు దూరం కానున్నారు. సంఘం నాయకులు శ్రావణ్ మాట్లాడుతూ.. గత 13 సంవత్సరాలుగా పనిచేస్తున్న తమను ప్రభుత్వం గుర్తించడం లేదన్నారు. చాలీచాలని వేతనాలు చెల్లిస్తూ శ్రమదోపిడీకి పాల్పడుతుందన్నారు. కార్యక్రమంలో కిషోర్, రూపేష్, శివరాం, ప్రకాష్, లక్కి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుపై అవగాహన కల్పించాలి



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీపీ జైవంత్‌రావు

ఉట్నూర్‌రూరల్: ఉద్యాన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని ఎంపీపీ పంద్ర జైవంత్ రావు అన్నారు. గిరి రైతులకు అందించేందుకు ఉద్యాన నర్సరీలోని పండ్ల మొక్కలను అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాణిజ్య పంటలకు బదులుగా ఉద్యాన పంటలు సాగు వైపు గిరిజన రైతులను ప్రోత్సహించాలన్నారు. అంతర పంటలుగా సాగు చేయవచ్చన్నారు. ఆయన వెంట ఐటీడీఏ పీహెచ్‌వో సందీప్, ఈజీఎస్ ఏపీవో రజినీకాంత్, ఏఈవో సుధీర్, లక్కారం ఉప సర్పంచ్ సత్తన్న, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా కుంకుమార్చన



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఓల్డ్ హౌసింగ్ బోర్డ్ కాలనీలోని ఆదర్శ గణేష్ మండపం వద్ద శుక్రవారం కుంకుమార్చన నిర్వహించారు. కాలనీ మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి సుఖ సంతోషాలతో ఉండాలని మొక్కుకున్నారు.

ఘనంగా మహాలక్ష్మి పూజలు

ఇచ్చోడ: మండలంలో మహాలక్ష్మి పూజలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రతీఏటా వినాయక చవితికి ఐదు రోజుల తరువాత మరాఠీ ప్రజలు ఈ పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. మహాలక్ష్మి ప్రతిమలను ప్రత్యేకంగా అలకరించి సాయంత్రం పూజలు చేస్తారు. ఇచ్చోడ, కోకస్మన్నూర్, చించోలి, దర్మంపూరి, ముఖరా(కె), ముఖరా(బి), జల్దా, జామిడి, నవేగావ్ మాదపూర్ గ్రామాల్లో ఈ పూజలు చేస్తారు. పిండి వంటలు చేసి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు.

ఆర్థిక సాయం

బోథ్: తమ డిమాండ్లు నెరవేర్చాలని గత కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్న సీఆర్పీలకు ప్రభుత్వం జీతాలు చెల్లించలేదు. దీంతో సొనాల గ్రామానికి చెందిన సీఆర్పీ దత్తుకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఆయనకు రూ. 15 వేల ఆర్థిక సాయం చేశారు.

క్షీరాభిషేకం

కై లాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపాల్టీకి రూ.50 కోట్ల నిధులను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం కేసీఆర్, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే జోగు రామన్న ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అజయ్, రమేశ్, కౌన్సిలర్లు వెంకన్న, పవన్, ప్రకాష్, మహేందర్, ప్రేమల, సురేఖ, రమ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ఇచ్చోడ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇచ్చోడ పీహెచ్‌సీ వైద్యాధికారి సాగర్ అన్నారు. శుక్రవారం స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా సిబ్బందితో కలిసి అడేగామ(కె), ఇస్లాంపూర కాలనీలో పర్యటించారు. ప్రజలకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఇంటి ఆవరణలో మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. హెల్త్ అసిస్టెంట్ కై లాస్, ఉత్తం, ఏఎన్ఎం సుధ, పద్మ, గంగామణి పాల్గొన్నారు.

నిధులు మంజూరు

జైనథ్: నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు సీఎం కేసీఆర్ రూ.27 కోట్లు నిధులు మంజూరు చేయడం జరిగిందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న ఒక ప్రకటనలో తెలిపారు. జైనథ్ మండల ప్రజలకు నాణ్యమైన విద్యుత్, వ్యవసాయ, పరిశ్రమ రంగాలకు అంతరాయం లేకుండా విద్యుత్ అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతనిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

నార్నూర్: మధ్యాహ్న భోజనం కార్మికులకు పెంచిన వేతనంతో పాటు పెండింగ్ బిల్లులు చెల్లించాలని శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ రాజలింగంకు మధ్యాహ్న భోజనం కార్మికులు వినతిపత్రం అందజేశారు. జిల్లా నాయకుడు జాడే నాందేవ్ మాట్లాడుతూ.. కార్మికులు చాలీచాలని వేతనంతో పని చేస్తున్నారని అన్నారు. జైతుబాయి, ప్రావంతిబాయి, శివాబాయి, పాల్గొన్నారు.

అనిల్ దేశ్‌పాండేకు జాతీయస్థాయి అవార్డు

ఆదిలాబాద్: జిల్లాకు చెందిన ప్రముఖ ఫొటోగ్రాఫర్ అనిల్ కుమార్ దేశ్‌పాండేకు మరో జాతీయ పతకం లభించింది. హిమాలయన్ కెమెరా క్లబ్ సిలిగురి డార్జిలింగ్ సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన 2వ హెచ్‌సీసీ నేషనల్ ఫొటోగ్రఫీ సెలూన్ 2023 వెడ్డింగ్ ఫొటోగ్రఫీలో అనిల్ తీసిన చిత్రం చైర్మన్ ఛాయిస్ పతకానికి ఎంపికై ంది. ఇప్పటివరకు అనిల్‌కు ఫొటోగ్రఫీలో 169 జాతీయ, అంతర్జాతీయ పతకాలు సాధించడం విశేషం.

'ప్రతిపక్షాలను నమ్మి మోసపోవద్దు'



మాట్లాడుతున్న అనిల్‌జాదవ్

ఇచ్చోడ: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, ప్రతిపక్ష నాయకులను నమ్మి ప్రజలు మోసపోవద్దని బీఆర్ఎస్ బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్‌జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని తలమద్రి గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ మిషన్ భగీరథ నీటిని అందిస్తున్నామన్నారు. వైకుంఠధామం, పల్లెప్రకృతి వనాలు, నాణ్యమైన విద్య, వైద్యం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, సర్పంచులు చిన్నయ్య, పాండరంగ్, ముఖరా(బి) ఎంపీటీసీ గాడ్గే సుభాష్, నాయకులు సర్పడే రమేశ్, సాబీర్ పాల్గొన్నారు.

పథకాల అమలులో ఆదర్శం



స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో పాల్గొన్న డీపీవో

ఇచ్చోడ: ప్రభుత్వ పథకాల అమల్లో ముఖరా(కె) పంచాయతీని ఆదర్శంగా తీసుకోవాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా నేరడిగొండ, బోథ్, తాంసి, తలమడుగు మండలాల ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులతో కలిసి గ్రామంలో పర్యటించారు. గ్రామంలో అమలు చేస్తున్న పథకాల తీరును అడిగి తెలుసుకున్నారు. పల్లెప్రకృతి వనం, సేంద్రియ ఎరువుల తయారీ, ఇంకుడు గుంతల, వ్యక్తిగత, సాముహిక మరుగుదొడ్లు, ఇంటింటికి చెట్ల పెంపకం, సోలార్ విద్యుత్ వీధిదీపాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎల్పీవో ధర్మారాణి, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా గణపతి నిమజ్జనం



నృత్యం చేస్తున్న భక్తులు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు పోల్లుగూడ, లక్ష్మీపూర్, హీరాపూర్ గ్రామాల్లో శుక్రవారం గణపతులను నిమజ్జనం చేశారు. భక్తులు ముగింపు రోజు ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా యువకులు చేసిన సంప్రదాయ నృత్యం ఆకట్టుకుంది. అనంతరం వాగుల్లో, చెరువుల్లో గణనాథులను నిమజ్జనం చేశారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలో శుక్రవారం అయ్యప్ప ఆలయం, పంచాయతీ కార్మికుల, ఎలక్ట్రిషన్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం గణనాథులను నిమజ్జనం చేశారు. అయ్యప్ప ఆలయంలో వైష్ణవ్‌ధన్ పీఠాధిపతి నారాయణ మహరాజ్ మాట్లాడుతూ.. హిందువులంతా సంఘటితమై హైందవ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలని సూచించారు. శోభాయాత్రలో భక్తులు చేసిన నృత్యం ఆకట్టుకుంది.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి



రాస్తారోకో చేస్తున్న నాయకులు

బోథ్: పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కుడాల స్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బోథ్ మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు వారి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కుడాల స్వామి, కారెం రవి, అన్నెపాక అశోక్, మామిడిపల్లి దశరథ్, దర్శనాల వినీత్, రాజు, గంగాధర్ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: మండలంలోని హస్నాపూర్‌లో ప్రధాన రహదారిపై ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఏన్నో ఏళ్లగా పోరాటం చేస్తున్నా.. బిల్లు ప్రవేశపెట్టక పోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు దాసరి రాంప్రసాద్, నగవాలే సతీశ్, పరుశురాం, తాజ్, దీపక్, మాన్సింగ్, విష్ణు, రాజు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడి



గేట్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలనే డిమాండ్‌తో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. నాయకులు కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అధికారులేవరూ అందుబాటులో లేకపోవడంతో కలెక్టరేట్ గేట్‌కు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. నాయకులు మల్లేష్, సుభాష్, మధుకర్, గోవర్ధన్, నంద కిషోర్, శ్రీను, రాజేశ్వర్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

నార్నూర్: పౌష్టికాహారంతోనే ఆరోగ్యంగా ఉండవచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు అ న్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ఆరోగ్యంపై సలహాలు, సూచనలు చేశారు. గర్భిణులు వర్ష కాలంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ చరణ్‌దాస్ చౌహాన్, హెచ్ఈ నాందేవ్ చౌహాన్, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బోథ్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లలిత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మూడో అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఇర్ఫాన, ఉమా, మనీషా, సుమంగళ, శాంత, లక్ష్మి, షాహీరా పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్‌రూరల్: గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని హెల్త్ సూపర్ వైజర్ బొమ్మెత సుభాష్ అన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం మావల మండలంలోని పిట్టల్‌వాడలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ పూనమ్, హెచ్ఏ ముంతాజ్ బేగం, తదితరులు పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లు దేశానికే గర్వకారణం

ఉట్నూర్‌రూరల్: మహిళా రిజర్వేషన్ బిల్లు దేశానికే గర్వ కారణమని తెలంగాణ సామాజిక విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంబ్లే ప్రజ్ఞశీల్ అన్నారు. కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపి, పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశా ల టీఎస్ఎస్‌వో నాయకులు జాడి వెంకటేశ్, వికాస్ వావల్కర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా బిల్లు చారిత్రాత్మక ఘట్టం

ఆదిలాబాద్: మహిళా బిల్లు ఆమోదం పొందడం చారిత్రాత్మక ఘట్టమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆమె నివాసంలో శుక్రవారం సంబురాలు జరుపుకున్నారు. ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

'అగ్రకులాల మహిళా బిల్లు రద్దు చేయాలి'

ఆదిలాబాద్‌రూరల్: అగ్రకులాల మహిళా రిజర్వేషన్ బిల్లును రద్దు చేయాలని ధర్మ సమాజ్ జిల్లా అధ్యక్షుడు, ఆదిలాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అగ్గిమల్ల గణేష్ మహరాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ, ఎస్సీ, ఎస్టీల కోటా కేటాయించలేదన్నారు. అగ్రకులాలకు సానుకూలంగా ఉన్న బిల్లును పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి అన్నెల లక్ష్మణ్, ఎల్మల మంజుష, ఏనుగు శ్యామల, సంగర్తి లక్ష్మి, సుష్మ, రాజీవ్, ప్రవీణ్, కరాడి గంగన్న, నవీన్, సాయి, రవి, విఠల్ పాల్గొన్నారు.